
# ప్రజాభూమి
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com



తెలంగాణ ఎడిటర్ విప్పల చంద్రశేఖర్ | బుధవారం | 22.01.2025 | పేజీలు : 08 | నమూన సంచిక | వెల : అమూల్యం


# ప్రతిష్టాత్మకంగా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

- పక్కాగా తెలంగాణ భూ భారతి అమలు
- అధికారులతో సమీక్షలో సీఎస్ శాంతికుమారి



హైదరాబాద్,ప్రజాభూమి

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టంలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని సిఎస్ శాంతికుమారి అన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కార్యాచరణ చేయాలన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025 పై మిగతా 2లో...

# తెలంగాణకు గుడ్‌న్యూస్..

- రెండు తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనున్న యూనిలీవర్
- సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబుతో యూనిలీవర్ సీఈవో, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ భేటీ
- కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకారం
- బాటిల్ క్యాప్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కూడా అంగీకారం




## కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల
# బాధ్యత ప్రభుత్వానిదే

- కమిషన్ ముందు హాజరైన ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు
- రుణాలు, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపుపై ప్రశ్నలు
- సుదీర్ఘంగా విచారించిన జస్టిస్ ఘోష్



# పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా?

- ఇస్తున్న మాపైన విమర్శలు చేయడం దారుణం
- ఇలాంటి వారిని ప్రజలు నమ్మొద్దన్న మంత్రి పొన్నం



హైదరాబాద్,ప్రజాభూమి

పదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అ మలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుందని మంత్రి అన్నారు.గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని ఆయన తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో మిగతా 2లో..

# బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం

- నగర మేయర్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం
- ఎమ్మెల్యే తలసాని నివాసంలో కార్పొరేటర్ల భేటీ
- హాజరైన నగర బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

2 లో



## కుంభమేళాలో
# వీఐపీల తాకిడి

- ఫిబ్రవరి 5న మోడీ రాక



న్యూఢిల్లీ,ప్రజాభూమి

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న 'మహాకుంభ్'కు కోట్లాదిగా భక్తులు తరలి వస్తున్నారు. జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు సాగే మహాకుంభ్ మేళాకు ప్రముఖుల సందడి కొనసాగుతోంది. ప్రధాన నరేంద్ర మోదీ ఫిబ్రవరి 5న తేదీన మహాకుంభమేళాలో పాల్గొంటారని సమాచారం. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జనవరి 27న, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ ఫిబ్రవరి 1న హాజరుకానున్నారు. షెడ్యూల్ ప్రకారం అమిత్‌షా మహాకుంభ్ మేళాలో పవిత్ర స్నానం, గంగా హారతిలో పాల్గొనడంతో పాటు అధికారులతో కూడా సమావేశమవుతారు. ఆయన పర్యటన మిగతా 2లో...

# గంటల్లోనే నలుగురు సీనియర్ అధికారులపై వేటు

- మరో వెయ్యి మంది ఉద్యోగాలు తొలగిస్తామంటూ హెచ్చరిక
- అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక నిర్ణయం




వాషింగ్‌టన్, ప్రజాభూమి

అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన కొన్ని గంటల్లోనే ప్రభుత్వంలోని నలుగురు సీనియర్ అధికారులపై వేటు వేశారు. మరో వెయ్యి మందిని ఉద్యోగాల నుంచి తీసివేస్తామంటూ ఆయన మిగతా 2లో..

## కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు..
# వంచన రాజ్యం

- రైతుల శాపనార్థాలతో కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుంది
- ట్విటర్ వేదికగా కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్,ప్రజాభూమి

ఇది రైతు రాజ్యం కాదని, రైతు వంచన రాజ్యమని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకే రోజు నలుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిదని మండిపడ్డారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదని, తోడేళ్లలా ప్రాణంతీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమని కేటీఆర్ చెప్పారు. మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో
# భారీ ఎన్‌కౌంటర్

- ఎన్‌కౌంటర్‌లో 27మంది మృతి
- కొనసాగుతున్న కాల్పులు



రాయపూర్,ప్రజాభూమి

ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. దీంతో ఈ ప్రాంతం యుద్ధ భూమిలా మారింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటి వరకు 27 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతుండటంతో రెండు రాష్ట్రాల సరిహద్దులోని అటవీప్రాంతం రణరంగంలా మారింది. ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు 27 మంది మావోయిస్టులు మిగతా 2లో...

## చిత్ర నిర్మాతల ఇళ్లపై
# ఐటి దాడులు

దిల్ రాజు, మైత్రీ మూవీ మేకర్స్ ఇళ్లు కార్యాలయాల్లో సోదాలు




హైదరాబాద్,ప్రజాభూమి

హైదరాబాద్‌లో మరోమారు ఐటి సోదాలు కలకలం రేపాయి. ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మిగతా 2లో..

# గంటల్లోనే నలుగురు సీనియర్ అధికారులపై వేటు

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. అధ్యక్ష కార్యాలయం ప్రస్తుతం అధికారుల వడపోత పనులు చూస్తోందని ట్రూత్ సామాజిక మాధ్యమం ద్వారా ట్రంప్ వెల్లడించారు. 'అమెరికాను మళ్లీ గొప్పగా మార్చాలి. మా విధానానికి అనుగుణంగా లేనివారంతా విధుల్లో కొనసాగలేరు. అలాంటివారిని గుర్తించే పక్రియలో మా అధ్యక్ష కార్యాలయం ఉంది. మునుపటి అధ్యక్షుడి హయాంలో నియమితులైన వారిలో అలాంటి వెయ్యి మందిని తొలగిస్తాం' అని నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు. ప్రెసిడెంట్స్ కౌన్సిల్ ఆన్ స్పోర్ట్స్, ఫిట్‌నెస్ అండ్ న్యూట్రీషన్, నేషనల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అడ్వైజరీ కౌన్సిల్, ప్రెసిడెంట్స్ ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్‌కు సంబంధించి నలుగురు సీనియర్ అధికారులను ట్రంప్ తొలగించారు. వీరితో పాటు మరో వెయ్యి మందిని తొలగిస్తామంటూ హెచ్చరించారు. అంతకుముందు.. యూఎస్ క్యాపిటల్‌పై దాడి చేసిన తన మద్దతుదారులకు ఉపశమనం కల్పించారు. వలస వచ్చినవారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని ట్రంప్ రద్దు చేశారు. వీటికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు కూడా జారీ చేశారు. పలు కేసుల సుడి గుండాల్లో చిక్కుకొని దోషిగా తేలినా.. పట్టిన పట్టు వదలకుండా రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టారు డొనాల్డ్ ట్రంప్. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ.. ఈ విజయంలో తన కుమారుడు బారన్ ట్రంప్ పాత్ర కీలకమంటూ కొనియాడారు. 'నా కుమారుడు బారన్ ట్రంప్ చాలా పొడగరి. యువత ఎలా ఓటింగ్ చేస్తారో అతడికి బాగా తెలుసు. బారన్ సూచనలతో కొన్ని కార్యక్రమాలు నిర్వహించాం. యువత ఓట్లతో 36 పాయింట్లు గెలిచాం' అంటూ ప్రశంసలు కురిపించారు.

## పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా?

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు మంత్రి పొన్నం. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు .. వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారాఅని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ నీ 5-10 లక్షలకు పెంచుకున్నామని ఆయన తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామని, ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చాం.. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈనెల లోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయని, ప్రజలు ఎవరు అధైర్యపడవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. గ్రామాల్లో నేటి నుండి గ్రామ సభలు జరుగుతుండడంతో ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు , ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఉంటే అధికారులకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలి అని, కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల , ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వారికి కాంగ్రెస్ క్యాడర్ అండగా నిలబడాలన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం

హైదరాబాద్,ప్రజాభూమి

బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకొంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ నివాసంలో నగర ఎమ్మెల్యేలు దాదాపు రెండు గంటల పాటు సమావేశమై.. ఈ అంశంపై చర్చించారు. అందులోభాగంగా జీహెచ్ఎంసీలో తమకున్న కార్పొరేటర్ల సంఖ్య బలంతోపాటు అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్య ఎంత అవసరమనే కోణంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు చర్చించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు మినహా మిగతా సభ్యులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే.. జీహెచ్ఎంసీపై పట్టు జారకుండా ఉండేదుకు బీఆర్ఎస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. 2020, డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. భారీగా డివిజన్లను కైవసం చేసుకొంది. దీంతో బంజారా హిల్స్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జీ విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేకే కుమార్తె కూడా కావడంతో.. గద్వాల్ విజయలక్ష్మిని మేయర్ పదవి వరించింది. అయితే 2023 ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హస్తం గూటికి చేరారు. లా బీఆర్ఎస్ పార్టీకి కేకేతోపాటు ఆయన కుమార్తె, మేయర్ జీ విజయలక్ష్మి రాజీనామా చేసి... హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. ఈ నేపథ్యంలో మేయర్ జీ విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేపట్టింది. అదీకాక ఈ ఏడాది చివరకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం సంకల్పించింది. రోవైపు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు డివిజన్లను మాత్రమే గెలుచుకొంది. కానీ రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వారి సంఖ్య19కి చేరింది. మరోవైపు ఈ ఏడాది చివరల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. ఇంకోవైపు గతేడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం కాంగ్రెస్, బీజేపీలు సరి సమానంగా ఎంపీ స్థానాలను గెలుచుకొన్నాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు సైతం దక్కలేదు. అలాగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైతం మేయర్ పీఠం హస్తగతం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళిలతో సిద్దమవుతోన్నారు.

## ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్



మొదటి పేజీ తరువాయి

మృతి చెందినట్టు భద్రతా బలగాలు గుర్తించాయి. మరికొంత మందికి తీవ్రగాయాలవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు 16 మంది మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టులను చుట్టు ముట్టిన కోబ్రా సైనికులు లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. మరో వైపు ఏకే 47లతో మావోయిస్టులు పెద్ద ఎత్తున కాల్పులు జరుపుతున్నారు. ఘటనా స్థలంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు ఆపరేషన్ ముమ్మరం చేశాయి.

# తెలంగాణకు గుడ్‌న్యూస్..

హైదరాబాద్,ప్రజాభూమి

కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలీవర్ ముందుకు వచ్చింది. ఇక్కడ పామాయిల్ పెంపకం కారణంగా యూనిట్ పెట్టాలని దావోస్‌లో జరిగిన సమావేశంలో సిఎంరేవంత్ చేసిన సూచనలను అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ,అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.

## కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు..
# వంచన రాజ్యం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ కాదు ఇది ఖూనీకోర్. ఆత్మహత్యలు కాదివి ముమ్మాటికి మీరు చేసిన హత్యలే అని అన్నారు. రుణమాఫీ చేయనందుకే ఈ ఆత్మహత్యలని అన్నారు. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం రాస్తాయని చెప్పారు. వారి కన్నీళ్లే కపట సర్కార్‌ను కూల్చి వేస్తాయని ఎక్స్ వేదికగా కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్ఎస్ పార్టీ 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివేదికను అందజేస్తుందని కేటీఆర్ తెలిపారు. రెండు వారాల పాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యల కు దారితీస్తున్న ప్రధానమైన కారణాల తోపాటు రాష్ట్రంలో ఏడాది నుంచి వ్యవసాయ సంక్షోభా నికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదిక తయారు చేస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్నకారు, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటుందని వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే 400 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్య చేసుకున్న ఆందోళనకర పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రైతు రుణమాఫీ కనీసం 30 శాతాన్ని దాటకపోవడం, రైతన్నలకు కొన్ని సంవత్సరాలుగా అందుతున్న రైతుబంధును ఆపి, ఇస్తామన్న రూ.15 వేల రైతు భరోసాను కూడా ఎత్తగొట్టడం వంటి ప్రధానమైన ఆర్థిక సమస్యలు రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు సరఫరా, సకాలంలో సాగునీటి వసతి కల్పించే విషయంలో సరారు పూర్తిగా చేతులెత్తేయడంతోనే రైతులు తీవ్ర సంక్షోభంలో కురుకుపోతున్నాని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్ర వ్యవసాయ రంగం పూర్తిగా చిన్నాభిన్నమైందని విమర్శించారు. రైతులు, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దికులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలనే సదుద్దేశంతోనే ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్టు కేటీఆర్ తెలిపారు. పదేండ్ల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. విస్తృత పర్యటనలు, అధ్యయనం తర్వాత పార్టీ తరఫున రూపొందించే ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేసి రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతుల సమస్యలపై వారికి ఇచ్చిన హామీల అమలుపై, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదే

హైదరాబాద్,ప్రజాభూమి

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం రామకృష్ణారావు కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆయన్ను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమాలపై విచారణ సుదీర్ఘంగా కొనసాగింది. సంక్రాంతి సెలవుల తర్వాత తిరిగి మంగళవారం నుంచి కమిషన్ విచారణను ప్రారంభించింది. దాదాపు గంటన్నర పాటు రామకృష్ణారావును కమిషన్ విచారించింది. దాదాపు 24 ప్రశ్నలను రామకృష్ణను కమిషన్ చైర్మన్ పిసి ఘోష్ అడిగారు. రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ఆయనను ముందు ప్రశ్నలు ఉంచారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, లోన్స్, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపు, వడ్డీల చెల్లింపులపై వంటి కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది.ఇప్పటికే రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ప్రశ్నించారు. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలు, ప్రాజెక్టు డిజైన్‌లు, బ్జడెట్ కేటాయింపులపై కమిషన్ ప్రశ్నించింది. కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారు? కార్పొరేషన్ ద్వారా ఆదాయాన్ని ఎలా జనరేట్ చేస్తారు? డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా? అని కమిషన్ ప్రశ్నించింది. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు చెప్పారు. ప్రాజెక్టు తొందరగా కట్టారు కానీ, నిబంధనలు పాటించలేదని ఈ సందర్భంగా కమిషన్ వ్యాఖ్యానించింది. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం, రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారని కమిషన్ ప్రశ్నించగా.. పరిశ్రమలకు నీళ్లు విక్రయించి ఆదాయం పొందేలా చేయడమే ప్రాజెక్టు లక్ష్యమని రామకృష్ణారావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు ఫిజికల్ పాలసీలు పెట్టలేదని ఈ సందర్భంగా కమిషన్ రికార్డులు చూపించింది. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు, ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులు నిర్వహించలేదని పేర్కొంది. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ రుణాలు తీసుకుందని, 9 నుంచి 10.5 శాతం వడ్డీతో రుణాలు చెల్లిస్తున్నామని రామకృష్ణారావు వివరణ ఇచ్చారు.కార్పొరేషన్‌కు నిధులు ఎలా వచ్చాయని కమిషన్ ప్రశ్నించింది. బడ్జెట్ కేటాయింపులు, లోన్స్ ద్వారా నిధులు సమకూర్చినట్లు రామకృష్ణారావు సమాధానం ఇచ్చారు. కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారన్న కమిషన్ ప్రశ్నకు.. పరిశ్రమలకు, ఇతర అవసరాలకు నీళ్లు అమ్మి రెవెన్యూ జనరేట్ చేయడమే ప్రాజెక్ట్ లక్ష్యమని రామకృష్ణ చెప్పినట్లు సమాచారం. డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా అని రామకృష్ణను కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. డిజైన్లను అప్రూవల్ చేసే సమయంలో నిబంధనలు పాటించలేదని కమిషన్ ప్రశ్నించగా.. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీతో ఎప్పుడూ సమావేశం కాలేదని, కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు రామకృష్ణారావు చెప్పారు. ప్రాజెక్ట్ తొందరగా కట్టారు కానీ నిబంధనలు పాటించలేదని కమిషన్ అడిగింది. అలాగే అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు పాలసీస్ పెట్టారా అని కమిషన్ ప్రశ్నించగా.. దానికి రామకృష్ణారావు తెలియదని సమాధానం ఇచ్చారు. ప్రాజెక్టుకు సంబంధించిన ֶ÷ల్స్ ప్రాపర్‌గా కేబినెట్ ముందుకు రాలేదని.. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదని కమిషన్ అడిగింది. నిబంధనలు పాటించకుండా విడుదల చేసిన నిధుల రికార్డులను రామకృష్ణారావుకు కమిషన్ చూపించింది. ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులను సరిగా మెయింటెయిన్ చేయలేదని కమిషన్ ప్రశ్నించగా.. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం గ్యారెంటీతోనే కార్పొరేషన్ లోన్స్ తీసుకుందని రామకృష్ణ తెలిపారు. 2024- 25 ֶ÷నాన్షియల్ ఇయర్లో రూ.7382 ప్రిన్సిపల్ అమౌంట్‌కు రూ.6519 కోట్ల వడ్డీ చెల్లించామని ఆయన వెల్లడించారు. 9 నుంచి 10.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని కమిషన్‌కు రామకృష్ణా రావు తెలిపారు. కాగా.. గతంలోనే ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న అన్ని శాఖల అధికారులు, ఇంజనీర్లతో అఫిడవిట్‌లను తీసుకుంది కమిషన్. ఆ అఫిడవిట్‌లను ముందు పెట్టుకునే కమిషన్ బహిరంగ విచారణ చేస్తోంది. గత జూలైలోనే విచారణకు రావాల్సిందిగా రామకృష్ణారావుకు కమిషన్ నోటీసులు ఇచ్చింది.

## ప్రతిష్టాత్మకంగా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

మొదటి పేజీ తరువాయి.

మంగళవారం సచివాలయంలో వర్క్ షాప్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ వర్క్ షాప్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025 వివరించేందుకే ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భూ భారతి చట్టం, 2025పై రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రెవెన్యూ పరిపాలనను క్రమబద్ధీకరించడంతో పాటు జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా సమగ్ర భూసంస్కరణలు తీసుకురావడమే ప్రభుత్వ విజన్ అని అన్నారు. ఈ చట్టం సమర్థవంత మైన వ్యవసాయ భూ పరిపాలన విధానాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని అనుసరించి 2024 జూలై 1న ముసాయిదా చట్టాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల నుండి వచ్చిన పలు సూచనలను స్వీకరించిన తరువాతే ఈ చట్టంను రూపొందించామని ఆయన తెలియజేశారు. శాసనసభ ఆమోదం పొందిన ఈ చట్టాన్ని గౌరవనీయులైన గవర్నర్ కూడా ఆమోదించడంతో ఈ నెల 4న గెజిట్ నోటిఫికేషన్ వెలువడిందన్నారు. యూజర్ ఫ్రెండ్లీ పోర్టల్‌ను తయారు చేయడంతో పాటు అవసరమైన నియమ, నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ -2025 ద్వారా రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఉద్దేశించిన ముఖ్యాంశాలను వివరించారు. సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్ లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందించడం ద్వారా, రాష్ట్ర వినియోగదారులకు స్వచ్ఛమైన, విశ్వసనీయమైన,సరసమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తూ, రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడం ఈ విధానం లక్ష్యం అన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు దానకిషోర్, రిజ్వీ, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శులు లోకేష్ కుమార్, యోగితా రాణా, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీశ్, ఇతర అధికారులు వర్క్ షాప్‌కు హాజరయ్యారు.

## చిత్ర నిర్మాతల ఇళ్లపై ఐటి దాడులు

మొదటి పేజీ తరువాయి

మైత్రీ మూవీస్ కార్యాలయాలు, 'పుష్ప 2' చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు జరుగుతున్నాయి. ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. దిల్ రాజు సతీమణి వైగారెడ్డిని కారులో తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఆదాయపుపన్ను అధికారులు తనను తీసుకెళ్లినట్లు దిల్ రాజ్ భార్య తెలిపారు. 'ఉదయం నుంచి ఐటీ శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సినిమాలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమే. ఐటీ శాఖ అధికారులు బ్యాంకు వివరాలు కావాలని అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం' అని ఆమె తెలిపారు. హైదరాబాద్ లో తెల్లవారుజాము నుండి ఐటి అధికారులు దాడులు నిర్వహించారు. మొత్తం 200 మంది అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నట్టు సమాచారం. ఇటీవల సంక్రాంతికి విడుదలైన రెండు స్టార్ హీరోల సినిమాలు నిర్మించిన సినీ నిర్మాత నివాసంతో పాటు, ఆఫీసు, కుటుంబసభ్యుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రముఖ ఆ నిర్మాత సోదరుడు, కుమార్తె నివాసంలో కూడా ఐటీ సోదాలు చేస్తున్నారు. మరోవైపు గతేడాది చివర్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అయి ఇండియా బిగ్గెస్ట్ హిట్ సాధించిన చిత్ర నిర్మాత ఆఫీసుల్లో కూడా తనిఖీలు చేస్తున్నారు. ఆ చిత్ర నిర్మాణ సంస్థల్లో కీలకమైన ముగ్గురు ఇళ్లలోను ఐటి అధికారులు ఈ తెల్లవారు జామున నుండి సోదాలు చేస్తున్నారు. చిత్ర నిర్మాణానికి చెందిన లావాదేవీలు, కలెక్షన్స్ తదితర వివరాలపై అరా తెస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఇద్దరి నిర్మాతలతో పాటు టాలీవుడ్ కు చెందిన ప్రముఖ మ్యూజిక్ లేబుల్ కంపెనీకి చేసిన అధినేత ఇంట్లో అలాగే ఆఫీసులో రైడ్స్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. సుమారు మూడు గంటల నుండి ఈ రైడ్స్ జరుగుతున్నట్టు సమాచారం.

## కుంభమేళాలో వీఐపీల తాకిడి

మొదటి పేజీ తరువాయి


సందర్భంగా సెక్యూరిటీ ఏజెన్సీలు కూడా నిఘా ఏర్పాట్లను మరింత విస్తృతం చేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిబ్రవరి 10న ప్రయాగ్‌రాజ్ వస్తారు. ఈ సందర్భంగా ఆమె సిటీలో జరిగే పలు కార్యక్రమాల్లో కూడా పాల్గొంటారు. ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహాకుంభమేళా ప్రాంతంలో మంగళవారంనాడు దట్టమైన పొగమంచు, చలిగాలులు ఉన్నప్పటికీ భక్తులు లెక్కచేయకుండా పవిత్ర స్నానాలు ఆచరించారు. రాబోయే రోజుల్లో కీలకమైన 4 'షాహి స్నాన్'లు (పవిత్ర స్నానాలు) ఉండటంతో యాత్రికుల తాకిడి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

# పోలీస్ పహారా మధ్య గ్రామసభలు

- ప్రజా వ్యతిరేకతకు ఇదే నిదర్శనం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, ప్రజాభూమి

ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. మీ సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని అన్నారు. ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు.ఎన్నికల ముందు హామీలిస్తం.. అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని.. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా.. రుణమాఫీ చేయడం దగా.. పంట బోనస్ ఇవ్వడం దగా.. రైతు భరోసా అమలు దగా.. రేషన్ కార్డుల జారీ దగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తున్నదని.. అడుగడుగునా ప్రశ్నిస్తున్నదని అన్నారు. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతరు.. ఎంత మందిని అరెస్టులు చేస్తరని నిలదీశారు. మీ రాక్షస పాలనలో విసిగి, వేసారిపోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళ్లు తెరవండని హితవు పలికారు. ప్రతిపక్షాల మీద బురదజల్లడం మాని పరిపాలన మీద దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# హైదరాబాద్‌లో మరో కిడ్నీ రాకెట్

- అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్స
- పోలీసుల దాడితో బట్టబయలైన వ్యవహారం

హైదరాబాద్, ప్రజాభూమి

హైదరాబాద్‌లో మరో కిడ్నీ రాకెట్ బట్టబయలు అయ్యింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరుగుతున్న గుట్టును పోలీసులు రట్టు చేశారు. సరూర్‌నగర్ డివిజన్‌లోని అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ రాకెట్ వ్యవహారం కలకలం రేపింది. అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహణ, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు.. సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అమాయకులకు డబ్బులు ఆశ చూపి, ఇతర ప్రాంతల నుంచి డాక్టర్లను తీసుకొచ్చి కిడ్నీ మార్పిడి చికిత్సల ద్వారా డబ్బులు దండుకుంటున్నారు. ఈ విషయం బయటికి వెలుగు చూడటంతో వైద్యారోగ్య శాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని పోలీసుల సహకారంతో తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకు చెందిన ఇద్దరికి కిడ్నీ మార్పిడి చికిత్సలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలు కిడ్నీలు ఇవ్వగా.. వాటిని కర్ణాటకకు చెందిన ఇద్దరు రోగులకు అమర్చినట్టు దర్యాప్తులో తేలింది. కిడ్నీ దాతలతో పాటు, ఇద్దరు రోగులను నాలుగు అంబులెన్స్‌లలో పోలీసులు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆరు నెలల క్రితమే అలకనంద ఆసుపత్రి ప్రారంభమైందని, ఇద్దరు వైద్యులతో చిన్న.. చిన్న శస్త్ర చికిత్సలకు మాత్రమే అనుమతి ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఇటీవలే వారికి కిడ్ని మార్పిడి చికిత్స జరగడంతో రోగులు అనారోగ్యానికి గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అలకనంద ఆసుపత్రిని సీజ్ చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసుపత్రి ఎండీ సుమంత్ చారీ, ఆసుపత్రి సిబ్బందిని అరెస్ట్ చేసినట్టు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు.




# ఢిల్లీలో కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య

- మరో హామీతో ముందుకు వచ్చిన బిజెపి

న్యూఢిల్లీ, ప్రజాభూమి

ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఎన్నికల్లో విజయం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), భారతీయ జనతా పార్టీ (బిజెపి), కాంగ్రెస్ పార్టీలు వోటర్లను ఆకర్షించేందుకు హామీలను గుప్పిస్తున్నాయి. ఇప్పటికు మేనిఫెస్టోను ప్రకటించిన బిజెపి తాజాగా మంగళవారం మరొక మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే అర్హులైన విద్యార్థులకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య సౌకర్యం కల్పిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. పాలిటెక్నిక్‌ర ఐటిఐలలో టెక్నికల్ కోర్సులు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) విద్యార్థులకు భీమ్ రావ్ అంబేద్కర్ స్టైపెండ్ పథకం కింద ప్రతి నెల రూ. 1000 వంతున ఉపకార వేతనాలు అందజేస్తామని పార్టీ హామీ ఇచ్చింది. యుపిఎస్‌సి, రాష్ట్ర సివిల్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేస్తామని పార్టీ ప్రకటించింది. ఒక ఆటో ట్యాక్సీ డ్రైవర్ సంక్షేమ మండలిని ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించిన బిజెపి డ్రైవర్లకు రూ. 10 లక్షల జీవిత బీమా, రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. అదే విధంగా ఇళ్లలో పని చేసే కార్మికుల కోసం సంక్షేమ మండలి ఏర్పాటుకు, అవే బీమా సౌకర్యాల కల్పనకు పార్టీ వాగ్దానం చేసింది. కేంద్ర మాజీ మంత్రి, బిజెపి సీనియర్ నేత అనురాగ్ ఠాకూర్ ఈ మేరకు బిజెపి సంకల్ప్ పత్ర పార్ట్ 2ను విడుదల చేశారు. ఆప్ హయాంలో చోటు చేసుకున్న కుంభకోణాలు, అవినీతిపై సిట్ ఏర్పాటు చేస్తామని అనురాగ్ ఠాకూర్ తెలియజేశారు. ఢిల్లీలో జల్ జీవన్ మిషన్ అమలులో విఫలమైనందుకు ఆప్ ప్రభుత్వాన్ని అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. సంకల్ప్ పత్ర పార్ట్ 1ను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ఇటీవలే విడుదల చేశారు. గర్భిణీ స్త్రీలకు రూ. 21 వేల ఆర్థిక సాయం, మహిళా సమృద్ధి యోజన కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై ఎల్‌పిజి సిలిండర్లను రూ. 500 ధరకే అందజేయడం వంటివి బిజెపి తొలి మేనిఫెస్టోలో ఉన్నాయి. మరొక వైపు బిజెపి మేనిఫెస్టోపై ఆప్ అధినేత అర్వింద్ కేజీవ్రాల్ స్పందిస్తూ, బిజెపి అధికారంలోకి వస్తే అర్హులైన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య లభిస్తుందా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ప్రతి విద్యార్థికీ ఉచిత విద్య అభిస్తోందని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కేజీవ్రాల్ కోరారు.






# రాహుల్ , ప్రియాంకలు శక్తి స్వరూపులు

- ఒకరు యువశక్తి...మరొకరు మహిళా శక్తి
- కీర్తించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

బెంగళూరు, ప్రజాభూమి

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీలను ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శక్తి స్వారుపులగా కొనియాడారు. ప్రియాంక 'స్త్రీ శక్తి'కి, రాహుల్ గాంధీ 'యువ శక్తి'కి చిహ్నాలుగా పేర్కొన్నారు. కర్ణాటకలోని బెళగావిలో నిర్వహించిన 'గాంధీ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న ఖర్గే ప్రసంగించారు. 'స్వాతంత్య్ర పోరాటయోధులు కిత్తూరు రాణి చెన్నమ్మ, ఝాన్సీ లక్ష్మీ బాయ్‌తో ప్రియాంకను ప్రజలు పోల్చుకుంటున్నారు. ప్రియాంక స్త్రీ శక్తికి చిహ్నం. ఆమె ఎంతో దృఢమైన మహిళ. తన తండ్రి రాజీవ్ గాంధీ మరణం తర్వాత ఆమె తన కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చారు. బెళగావి బిడ్డ కిత్తూరు రాణి చెన్నమ్మ గొప్ప మహిళ. ఆమె ప్రజల కోసం ఎంతో పోరాటం చేశారు. ప్రస్తుతం భాజపా, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా ప్రియాంక పోరాడుతున్నారు' అని ఖర్గే పేర్కొన్నారు. 'ప్రియాంక స్త్రీ శక్తికి.. రాహుల్ గాంధీ యువశక్తికి చిహ్నం. మేమంతా ప్రజల వెంటే ఉంటాం' అని అన్నారు. ఈ సందర్భంగా ఖర్గే ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు చేశారు. వారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. గాంధీ కుటుంబమే లక్ష్యంగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు.



## యువత జీవితాలతో ఆడుకుంటున్న బిజెపి

- బిజెపి పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు
- ఘాటు విమర్శలు చేసిన రాహుల్



న్యూఢిల్లీ, ప్రజాభూమి

భాజపా పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ ఘటనలు నమోదవుతున్నాయని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. పేపర్ లీక్‌లను యువత హక్కులను కాలరాసే ఆయుధంగా కాషాయ పార్టీ మార్చుకుందని ఆరోపించారు. 'భాజపా పాలిత రాష్ట్రాల్లో నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిరసనలు చేపట్టిన బీపీఎస్‌సీ అభ్యర్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. అభ్యర్థులను కలిసినప్పుడు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పేపర్ లీక్ అయితే.. కచ్చితంగా అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంది. ప్రస్తుతం అభ్యర్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గాంధేయ మార్గంలో నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడికి యత్నించారు. బాధితులపై కేసులు పెట్టారు' అని రాహుల్ గాంధీ తన యూట్యూబ్ ఛానెల్‌లో వీడియో పోస్టు పెట్టారు. '28 పరీక్షా కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగినా ప్రభుత్వం ఇంకా అంగీకరించేందుకు సిద్ధంగా లేదు. ఇది కేవలం బిహార్‌కు సంబంధించిన సమస్య కాదు. యావత్ దేశానికి చెందిన సమస్య. అభ్యర్థుల నిరసనల అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతాం' అని హామీ ఇచ్చారు. కాగా.. గతేడాది డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

## గణతంత్ర వేడుకల కోసం ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్



న్యూఢిల్లీ, ప్రజాభూమి

భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు దేశ రాజధాని ఢిల్లీలో ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ రిహార్సల్స్ జరుగుతున్నాయి. వాయుసేనకు చెందిన యుద్ధ విమానాలు, హెలిక్యాప్టర్‌లు, విమానాలతో ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది చేస్తున్న విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. ప్రతి ఏడాది రిపబ్లిక్ డే వేడుకలకు ముందు ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అదేవిధంగా ప్రతి ఏడాది ఒక విదేశీ అధినేతను భారత రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించడం కూడా ఆనవాయితీగా కొనసాగుతున్నది. కరోనా సమయంలో రెండేళ్లు తప్ప ఈ ఆనవాయితీకి ఎప్పుడూ బ్రేక్ పడలేదు. ఈసారి గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో చీఫ్ గెస్టుగా వస్తున్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు ముందు కర్తవ్యపథ్‌లో నిర్వహిస్తున్న ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్‌కు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

## ప్రజావాణికి మొత్తం 5736 దరఖాస్తులు రాక



హైదరాబాద్,ప్రజాభూమి

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 5736 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 132, విద్యుత్ శాఖ కు సంబంధించి 131, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 01, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 5332 దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


## డెహ్రాడూన్ పర్యటనలో పద్మారావుకు గుంటెపోటు

హైదరాబాద్, ప్రజాభూమి

డెహ్రాడూన్ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ సీనియర్ నేత, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు వైద్యులు చికిత్స చేసి స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని.. ఎలాంటి ప్రాణప్రాయం లేదని డాక్టర్లు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన హైద్రాబాద్‌కు రానున్నారు. తమ అభిమాన నేతకు గుండె పోటు వచ్చిందని తెలియడంతో పద్మారావు గౌడ్ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు గురి అయ్యారు. పద్మారావు గౌడ్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని తెలపడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గుండె పోటుకు గురయ్యారని తెలియడంతో బీఆర్ఎస్ నేతలు ఆయన ఇంటికి తరలి వెళ్తున్నారు. పద్మారావు గౌడ్ హెల్త్ కండిషన్‌పై బీఆర్ఎస్ అధిష్టానం ఆరా తీసినట్లు తెలిసింది.

# జూబ్లీహిల్స్‌లో ప్రోటోకాల్ వివాదం

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు



హైదరాబాద్,ప్రజాభూమి

నగరంలోని జూబ్లీహిల్స్‌లో మరోసారి ప్రోటోకాల్ వార్ నెలకొంది. రెహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. పోలీసులకు కాంగ్రెస్ నేతలకు మధ్య వాగ్వాదం తోపులాటకు దారి తీసింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండా నిర్వహిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల ఫోటోలతో ఫ్లెక్సీలు లేకుండా ఎమ్మెల్యే మాగంటి తీసివేస్తున్నారంటూ కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రోటోకాల్ రగడ చోటు చేసుకుంది. కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని.. ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం రేవంత్ రెడ్డి, సిటీ ఇన్‌చార్జ్ మినిస్టర్ ఫోటోలను లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. రెహమత్‌నగర్‌లో ఆందోళనకు దిగిన స్థానిక కార్పొరేటర్లను పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎక్కడా కూడా ప్రోటోకాల్ పాటించడం లేదని, ఇంకా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నట్లుగానే వ్యవహరిస్తున్నారని స్థానిక కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గోపీనాథ్ ఇక్కడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. గత మూడు నెలలుగా షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్‌లు వచ్చినప్పటికీ సంతకాలు చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కావాలనే చెక్‌లపై సంతకాలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలు తప్పకుండా ఉండాలన్నారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ఫోటోలు లేకుండా ప్రైవేటు కార్యక్రమంలా నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ ఇంగితజ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. అన్ని డివిజన్లలో ఇదే పరిస్థితి కొనసాగుతోందన్నారు. ఎమ్మార్వో ఆఫీసులో 500లకు పైగా చెక్‌లు ఉన్నాయని.. వాటిని పంపిణీ చేయకుండా.. కావాలనే కాలయాపన చేస్తూ పేద ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మండిపడ్డారు.

## బీఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలగింపు

- అధికారులను ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు
- బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు



నల్లగొండ ప్రజాభూమి

నల్లగొండలో కేటీఆర్ రైతు మహాధర్నా ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. రైతు ధర్నాకు పోలీసులు అనుమతించలేదు. అయితే అప్పటికే నల్లగొడ పట్టణంలో ధర్నాకు సంభందించి ఫెక్సీని బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేశారు. కాగా, అర్ధరాత్రి వాటిని తొలగింస్తుండగా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించారు. అయినప్పటికి అధికారులు ఫ్లెక్సీని తొలగించారు. కాంగ్రెస్ చెత్త రాజకీయాన్ని ప్రశ్నించేందుకు మున్సిపల్ ఆఫీసుకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి చేరుకున్నారు. అయినప్పటికి మున్సిపల్ కమిషనర్ స్పందించలేదు. మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల వ్యవహరిస్తుండటంతో కమిషనర్ ఛాంబర్ లోనే పార్టీ కౌన్సిలర్లు, నేతల్తో కలిసి భూపాల్ రెడ్డి బైఠాయించారు. కాగా, మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన ఆందోళనలో హైడ్రామా చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్యాలయంలోకి కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి రంగ ప్రవేశం చేశారు. బీఆర్ఎస్ నేతలపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. పూల కుండీలు విసురుతూ దాడికి యత్నించారు. కాంగ్రెస్ నేతల దౌర్జన్యంపై పోలీసులు చూస్తూ ఉండి పోయారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మాజీ ఎమ్మెల్యే కంచర్లతో సహా బీఆర్ఎస్ నేతలను బలవంతంగా అరెస్ట్ చేశారు. పోలీసులతో తీవ్ర తోపులాటలో భూపాల్‌రెడ్డి సొమ్మసిల్లి పడిపోయారు. అనంతరం నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే దాడికి పాల్పడిన కాంగ్రెస్ నేతలు మున్సిపాలిటీ కార్యాలయంలోనే ఉండటం గమనార్హం.

## కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయంలో అపచారం

- పెద్ద పెద్ద కెమెరాలతో ఓ ప్రైవేటు ఆల్బమ్ షూట్



కాళేశ్వరం,ప్రజాభూమి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయంలో అపచారం జరిగింది. సాధారణంగా ఆలయంలో సెల్‌ఫోన్‌తోనే ఫొటోలు, వీడియోలు చిత్రీకరించనివ్వరు. అలాంటిది ప్రముఖ పుణ్యక్షేత్రంలో పెద్ద పెద్ద కెమెరాలతో ఓ ప్రైవేటు ఆల్బమ్‌ను షూట్ చేశారు. గుడి తలుపులు మూసేసి మరీ గర్భగుడిలో ప్రైవేటు ఆల్బమ్‌ను చిత్రీకరించారు. ఇందుకోసం దర్శనానికి వచ్చిన భక్తులను సైతం బయటే నిలిపివేయడం గమనార్హం. ఈ ఘటనపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులను నిలిపివేసి మరి ఆలయ గర్భగుడిలో ఓ ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరిస్తున్నప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. ఆలయ పవిత్రతను అధికారులు దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యలైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ ఆలయం ఉంది. త్రిలింగాల్లో ఇది ఒక ప్రదేశం (ద్రాక్షారామం, శ్రీశైలం). కాళేశ్వరాలయానికి ముక్తేశ్వరాలయం అని పేరు. ఈ ఆలయంలో ఒకే వేదికపై రెండు శివలింగాలు ప్రతిష్ఠించబడినవి.ఒక శివలింగానికి కాళేశ్వరుడు, రెండో లింగానికి ముక్తేశ్వరుడు అని పేర్లు ఉన్నాయి. ఈ ఆలయానికి పిరమిడ్ ఆకారంలో శిఖరం నిర్మించబడి ఉంది (అది ప్రస్తుతం లేదు). ఈ ఆలయానికి ఉత్తరంగా మరొక చిన్న గుడి ఉండేది. అందులో అన్నపూర్ణ దేవి ప్రతిమ ఉండేది. ఇప్పటికీ ఈ ఆలయంలో గణపతి, మత్స్యావతారం, చతుర్ముఖలింగం, సూర్య, విష్ణు, నంది మొదలైన విగ్రహాలు ఉన్నాయి. తెలంగాణలో ప్రసిద్ధక్షేత్రంగా అభివృద్ధి చెందిన దేవాలయం ఇది. కాబట్టి విద్యానాథుడు దీన్ని త్రిలింగ దేశానికి ఒక సరిహద్దుగా కీర్తించాడు.

### రైతులకు ప్రయోజనం కోసం


## కేంద్రం కృషి: శ్రీనివాసవర్మ



రాజమండ్రి,ప్రజాభూమి

రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్నదే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం అని బిజెపి ఎంపి, కేంద్ర భారీ పరిశ్రమల శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. రాష్ట్రంలో పండిస్తున్న పసుపు, మిరప ఉత్పత్తులలో దేశం ప్రథమ స్థానంలో ఉందని ఆయన అన్నారు. ఆయన రాజమండ్రిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'సిటి ఆర్ఐ పరిధిని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తుంది. టూబాకో నిషేధం కొనసాగుతున్నందున ఇతర పంటలపై పరిశోధనలు చేయాలి. రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్నదే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం. సిటిఆర్ఐ పరిధిలో మరో 4 పంటలను కలిపి ఉత్పత్తి పెంచాలి. గోదావరి జిల్లాల్లో రైతులు, సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు పరిశోధనలు ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## బీజేపీ చాలా ప్రమాదకర పార్టీ : కేజ్రీవాల్



న్యూఢిల్లీ,ప్రజాభూమి

అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ రెండు విడతలుగా విడుదల చేసిన సంకల్ప్ పాత్ర ఇటు ఢిల్లీకి, అటు దేశానికి ప్రమాదకరమని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హెచ్చరించారు. తాము ఉచిత విద్యను అందిస్తుంటే వాళ్లు అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత విద్యను నిలిపివేస్తారని అన్నారు. నాలుగు రోజుల క్రితం విడుదల చేసిన తొలి సంకల్ప పాత్రలో మొహల్లా క్లినిక్‌లు ఆపేస్తామని ప్రకటించారని మంగళవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ కేజ్రీవాల్ చెప్పారు. బీజేపీకి అధికారం ఇస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను సైతం నిలిపివేస్తారని అన్నారు. అర్హులైన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య ఇస్తామంటున్నారు. బీజేపీ చాలా ప్రమాదకరమైన పార్టీ. ఆ పార్టీకి ఓటు వేస్తే మీ బడ్జెట్ తలకిందులవుతుంది. ఇక ఢిల్లీలో మీరు జీవనం సాగించలేరు" అని ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ హెచ్చరిక చేశారు. తాము 18 లక్షల మంది పేద విద్యార్థులకు ఢిల్లీలో ఉచిత విద్య అందిస్తున్నామని, బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్య సహాయం, ఉచిత విద్యుత్ నిలిపివేస్తారని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం 'సంకల్ప్ పాత్ర-2'ను బీజేపీ లోక్‌సభ ఎంపీ అనురాగ్ ఠాకూర్ మంగళవారంనాడు విడుదల చేశారు. ప్రభుత్వ సంస్థల్లో విద్యార్థులకు ఇచిత విద్య, ఆటోరిక్షా డ్రైవర్లు, డొమెస్టిక్ వర్కర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, బీమా పథకం, ఆప్ హయాంలో జరిగిన అవినీతిపై సిట్ ఏర్పాటుకు మేనిఫెస్టో వాగ్దానం చేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 699 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఫిబ్రవరి 5న ఓటింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి. ఢిల్లీలో 15 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఆప్ 2015 అసెంబ్లీ ఎన్నికల్లో 67 సీట్లు, 2020 ఎన్నికల్లో 62 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 8 సీట్లకే పరిమితమైంది.

### జూరాల డ్యామ్ నుంచి

## నీరు లీకేజీ



మహబూబ్‌నగర్ ప్రజాభూమి

ఓ వైపు కృష్ణా నదిలో నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించుకుపోతున్నా పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్.. మరో వైపు ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడంతో వృధాగా కృష్ణమ్మ దిగువకు పోతున్నది. తెలంగాణలో కృష్ణా నదిపై ఉన్న తొలి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల డ్యామ్ నుంచి నీరు లీక్ అవుతున్నది. ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించకపోవడంతో తుప్పు పట్టి, రబ్బర్‌లు ఊడిపోయాయి. దీంతో మొత్తం 12 క్రస్ట్ గేట్ల నుంచి నీరు దిగువకు పోతున్నది. ఇందులో 8 గేట్ల రోప్ దెబ్బతిన్నది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూరాల ప్రాజెక్టును 1995లో ప్రారంభించారు. 9.68 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించారు. ఇటీవల కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు జలాశయం నిండు కుండలా ఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యం ప్రాజెక్టును వెంటాడుతున్నది. క్రస్ట్ గేట్లకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపట్టి గేట్లకు అమర్చిన రబ్బర్లు ఊడిపోయాయి. దీంతో ఆ ప్రాతంలో నీరు లీకవుతుండటంతో క్రమంగా ప్రాజెక్టు ఖాళీ అతువున్నది. వేసవి నాటికి పరిస్థితి ఇలాగే కొనసాగితే జూరాలపై ఆధారపడిన ప్రజలకు నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నది.

# పెట్రో కెమికల్స్ అన్వేషణకు భావనపాడు వ్యూహాత్మక ప్రాంతం

- ఏపీలో సోలార్ సెల్ తయారు ప్లాంటు ఏర్పాటు చేయండి
- పారిశ్రామికవేత్త లక్ష్మీమిట్టల్‌ను కోరిన చంద్రబాబు, లోకేశ్



దావోస్,ప్రజాభూమి

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉక్కు దిగ్గజం లక్ష్మి మిట్టల్‌తో చంద్రబాబు, లోకేష్ ప్రత్యేక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భావనపాడులో పెట్రో కెమికల్ హబ్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టాలని, ఏపీలో సోలార్ సెల్ తయారు ప్లాంటు ఏర్పాటును పరిశీలించాలని లక్ష్మి మిట్టల్‌ను మంత్రి లోకేష్ కోరారు. లక్ష్మి మిట్టల్, సీఈవో ఆదిత్య మిట్టల్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్నాం అని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్రో కెమికల్స్ అన్వేషణకు భావనపాడు వ్యూహాత్మక ప్రాంతం అని మంత్రి లోకేష్ లక్ష్మి మిట్టల్‌కు తెలిపారు. ప్రణాళికాబద్ధమైన 83.3 ఎంటీపీఏ సామర్థ్యం గల పోర్టు, వైజాగ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ కొలువై ఉండటం, స్థిరమైన మౌలిక సదుపాయాలు, బలమైన ప్రభుత్వం మద్దతు పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులకు అనుకూలతలుగా ఉంటాయని మంత్రి వివరించారు. భావనపాడు-మూలపేట ప్రాంతం తయారీ, ఆర్ అండ్ డీ, లాజిస్టిక్స్ సౌకర్యాలను నెలకొల్పడానికి.. పెట్రోకెమికల్స్, గ్రీన్ ఎనర్జీలో నూతన ఆవిష్కరణలకు అసమానమైన అవకాశాలు కలిగి ఉందని వివరించారు. హెచ్‌పీసీఎల్-మిత్తల్ సంయుక్త భాగస్వామ్య సంస్థ ఊఓఇఒ-ఊఖఅఒ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.3,500 కోట్లతో భారత దేశంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్న 2సోలార్ సెల్ తయారీ ఎ÷-లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని ఉక్కు దిగ్గజం లక్ష్మి మిట్టల్‌ను మంత్రి లోకేష్ కొరారు. ఈ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేందుకు ఏపీఈడీబీ అధికారులతో కలసి సైట్‌ను సందర్శించాలన్నారు. 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని మంత్రి లోకేష్ తెలిపారు.

# సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం

## - గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఎపి అవతరణ
## - దావోస్ సదస్సులో చంద్రబాబు వివరణ

దావోస్, ప్రజాభూమి



సంప్రదాయేతర ఇంధన వనరులపై తమ ప్రభుత్వం అధిక దృష్టి సారించిందని, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సౌర, పవన విద్యుత్‌తో పాటు హైడ్రోజన్ ఎనర్జీ హబ్‌గా ఎపి మారబోతోందని అన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ పై నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ దేశాలకు భారతీయులు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 'మీ అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది. భవిష్యత్‌లో నా కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందింది. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. 25 ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయా. ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయని అన్నారు. 2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్‌పై ఎక్కువ దృష్టి పెట్టాం. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టాం. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టాం. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయి. 500 మెగావాట్ల , 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ–ఏపీ జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతు న్నాయి. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోంది. ఏపీలో విద్యుత్ ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటులో పోర్టులు ఉన్నాయి. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సాహకాలు అందిస్తుంది. పీఎం సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నాం. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉంది. రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయంపైనా దృష్టి పెట్టాం. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుంది. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాం. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామికవేత్తలే కనిపిస్తున్నారు. భారతీయులు అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నాను. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో సేవలు అందించాలి. ప్రపంచంలోని అనేక దేశాల్లో రాజకీయ అనిశ్చితి ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉంది'అని చంద్రబాబు అన్నారు. రెండో రోజు దావోస్‌లో మిట్టల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మి మిట్టల్, సీఈఓ ఆదిత్య మిట్టల్‌తో సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ సమావేశమయ్యారు. ఆర్సెలర్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా 17.8 మిలియన్ టన్నుల కెపాసిటీతో గ్రీన్ ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయడానికి ఇప్పటికే అంగీకారం కుదిరిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు ముందుకు తీసుకెళ్లే అంశంపై ముఖ్యమంత్రి బృందం చర్చలు నిర్వహించింది. మరోవైపు వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు ఘనంగా ప్రారంభమైంది. జ్యూరిచ్ కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల ప్రాంతంలో దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో ప్రారంభమైన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజర య్యారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా హాజరైన పారిశ్రామిక వేత్తలతో పెట్టుబడుల అవకాశాలు, పొటెన్షియల్ కొలాబరేషన్స్‌పై చర్చించారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్ ప్లీనరీ హాలు లాబీలో ఏర్పాటు చేసిన నెట్ వర్కింగ్ డిన్నర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలను పారిశ్రామిక వేత్తలకు సీఎం చంద్రబాబు వివరించారు.

# మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

## - మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో ఘటన




మహబూబ్‌నగర్, ప్రజాభూమి

వైద్యం కోసం వెళ్లిన ఓ మహిళపై ఓ నర్సు దాష్టీకం ప్రదర్శించింది. ఇష్టమొచ్చినట్లు తిడుతూ చేయి కూడా చేసుకుంది. ఊహించని ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపం చెందిన సదరు మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం ఉదయం ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. దామరగిద్ద మండలం కందేన్‌పల్లికి చెందిన నారమ్మ (32) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సోమవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. అయితే రాత్రి సమయంలో విధుల్లో ఉన్న ఓ నర్సు నారమ్మపై దౌర్జన్యం ప్రదర్శించింది. ఆమెను ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా చేయి కూడా చేసుకుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి అని బాత్‌రూంలోకి వెళ్లింది. కానీ ఎంతసేపటికీ బయటకు రావడంతో బంధువులు తలుపులు బద్దలగొట్టి చూడగా ఉరేసుకుని నారమ్మ కనిపించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నర్సు దుర్భాషలాడుతూ చేయి చేసుకుందనే మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

# తెలంగాణకు చెందిన ఓ ట్రస్టుకు నోటీసులు

గోపేశ్వర్,ప్రజాభూమి

ఉత్తరాఖండ్‌కు చెందిన బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ తెలంగాణకు చెందిన ఓ ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలకు చెందిన నమోనాలను తెలంగాణలో నిర్మించేందుకు ఓ ట్రస్టు ప్లాన్ చేసింది. హిమాలయాల్లోని ఆ గుళ్ల నమోనాలను పునర్ సృష్టించవద్దు అని కమిటీ తన నోటీసులో పేర్కొన్నది. సోమవారమే ఆ నోటీసులు జారీ అయ్యాయి. ఆలయ కమిటీకి చెందిన మీడియా ఆఫీసర్ హరీశ్ గౌర్ ఆ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ఆలయ కమిటీ ప్యానల్‌లోని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్ ప్రసాద్ తప్లియాల్ దానిపై సంతకం చేశారు. హిమాలయ పర్వతాల్లోని బద్రీనాథ్, కేదార్‌నాథ్ క్షేత్రాలను భక్తులు కొన్ని శతాబ్ధాల నుంచి విజిట్ చేస్తున్నారని, అయితే ఆ ఆలయాలకు చెందిన నమోనాలను రీక్రియేట్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కమిటీ తన నోటీసులో తెలిపింది. రెండు వారాల్లోగా తమ నోటీసులకు స్పందించాలని బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ కోరింది. ఒకవేళ స్పందన లేని పక్షంలో.. సివిల్, క్రిమినల్ చర్యలు ఉంటాయని ఆలయ కమిటీ తన నోటీసులో పేర్కొన్నది.

# నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ గుండాల రాజ్యం

## - సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపాటు

సూర్యాపేట,ప్రజాభూమి



నల్లగొండ జిల్లాలో పోలీస్, కాంగ్రెస్ గుండాల రాజ్యం నడుస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సహా పార్టీ శ్రేణుల అరెస్ట్ పై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మంత్రి వెంకట్ రెడ్డికి కేటీఆర్ ఫోబియా పట్టుకుంది. కేటీఆర్ ఫొటోచూసినా గులాబీ రంగు చూసినా వెంకట్ రెడ్డికి భయమవుతున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలను వదిలి కావాలనే మున్సిపాలిటీ అధికారులు బీఆర్ఎస్ ఫ్లెక్సీలు చించేశారు. మంత్రి వెంకట్ రెడ్డి సోయిలో లేకుండా ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. వెంకట్ రెడ్డి మాటలు విని డ్యూటీ చేస్తే అధికారులు ఇబ్బందులు పడుతారన్నారు. పోలీస్ రాజ్యం అమలు చేస్తే చూస్తూ ఊరుకోం. పాలన ఇలానే కొనసాగితే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. మంత్రి స్వయంగా ఫోన్ చేసి మాపై కార్యకర్తలను ఉసిగొల్పుతున్నాడు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ నాయకులకు ఏం పని అని ప్రశ్నించారు. చిల్లర దాడులు మమ్మల్ని ఆపలేవన్నారు. కాంగ్రెస్ పాపాల పుట్ట పలుగుతుంది. కాంగ్రెస్ రహిత తెలంగాణా కోసం నల్లగొండ నుంచే ఉద్యమం మొదలవుతుందన్నారు. కాంగ్రెస్ హఠావో తెలంగాణా బచావో నినాదం మొదలైంది. గుర్తుపెట్టుకోండి ..ఇప్పటికైనా మారకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదన్నారు. గ్రామ సభల్లో కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడుతుంది. రెండు సార్లు ప్రజల దరఖాస్తులు తీసుకుని బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాల పై ప్రజల తిరుగుబడటం ఖాయమన్నారు.

# రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌పై చేయిచేసుకున్న ఎంపీ ఈటల



మేడ్చల్ మల్కాజిగిరి, ప్రజాభూమి

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేయి చేసుకోవడం సంచలనంగా మారింది. జిల్లాలోని పోచారం మున్సిపాలిటీ ఏకశిల నగర్‌లో ఎంపీ పర్యటించారు. ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ పేదల భూములు కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీకి విన్నవించారు. ఈ నేపథ్యంలో పేదల భూములు కబ్జా చేయడంతో ఆగ్రహించిన రాజేందర్ స్థిరాస్తి వ్యాపారిపై దాడి చేశాడు. ఇదే సమయంలో ఎంపీ అనుచరులు, బాధితులు సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడికి పాల్పడ్డారు. కాగా, రద్దయిన ఏకశిల వెంచర్లో రియల్ బ్రోకర్స్ అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ ఈటల బ్రోకర్లపై చేయి చేసుకున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఏపిలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి

## - కూటమి ప్రభుత్వంపై నమ్మికతో ముందుకు వస్తున్నారు
## - మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

నంద్యాల,ప్రజాభూమి



కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామిత్తలు ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడం, కేంద్ర ప్రభుత్వం ఇటీవల విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం 11 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించడం చంద్రబాబు పరిపాలనకు నిదర్శనమని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ ఎండి ఫారుక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ .. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నం అభివృద్ధి చెందుతున్న నగరాలలో మొదటిది. గత ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు కాకుండా పరిశ్రమలను మూసేందుకు ఎక్కువ కృషి చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఏపీ అభివృద్ధి కోసం ఇతర దేశాలలో ఉన్నటువంటి మన ప్రాంత పారిశ్రామి కవేత్తల ద్వారా పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. నెల్లూ రు జిల్లా రాయపట్నం ప్రాంతంలో బిపిసిఎల్ ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టులతోపాటు పిన్నాపురం గ్రీన్ పార్క్ ఓర్వకల్లు డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రాజెక్టు అలాగే నదుల అనుసంధానంతో రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృత నిశ్చయంతో ఉన్నారు. రానున్న రోజులలో ఆంధప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తుందని ఆయన అన్నారు. నంద్యాల అభివృద్ధిలో నియోజకవర్గ ప్రజలు సహకరించాలని మన నంద్యాల, మన అభివృద్ధి లో అందరం భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు.

# గ్రీన్ ఎనర్జీలో ముందువరసలో ఏపి

## - విశాఖ ఉక్కును కాపాడిన ఘనత బాబుదే
## - విశాఖపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర



విశాఖపట్నం,ప్రజాభూమి

గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విశాఖ ఉక్కును సీఎం చంద్రబాబు కాపాడారని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం సహాయం చేసిందని తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ... ఏపీ అభివృద్ధి స్టీల్ ఎ÷–లాంట్ వల్లే సాధ్యం అవుతుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కేవలం భూ దోపిడీ కోసం మాత్రమే స్టీల్ ఎ÷–లాంట్ వ్యవహారం నడిపారని ఆరోపించారు. రైల్వే జోన్ భవనాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వానికి ఏపీ అభివద్ధిపై ఉన్న చిత్త శుద్ధికి ఇదే నిదర్శనమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 99 శాతం భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయని చెప్పారు. అనకాపల్లిలో గ్రీన్ స్టీల్ ఎ÷–లాంట్ మీద ఆర్సిలర్ సంస్థ మిట్టల్‌తో సీఎం చంద్రబాబు దావోస్‌లో ఏంవోయూ చేసుకున్నారని చెప్పారు. ఐదేళ్ల క్రితం జగన్ ప్రభుత్వం విశాఖలో భూములు కొట్టేసిందని ఆరోపించారు. దసపల్లా, వాల్తేరు క్లబ్ భూములు కూడా కొట్టేసేందుకు ప్రయత్నం చేశారని విమర్శించారు. విశాఖకు టీసీఎస్, గూగుల్, సంస్థలు వస్తున్నాయని తెలిపారు. పోలవరం పనులు వేగంగా జరుగుతాయని అన్నారు. పోలవరం నుంచి బాహుదా వరకు అన్ని ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# సిఆర్‌డిఏ భూముల్లో అక్రమంగా సాగు

## - యంత్రాలతో దున్నేసిన అధికారులు

అమరావతి, ప్రజాభూమి

రాజధాని అమరావతి పరిధిలోని శాఖమూరు గ్రామంలో సి ఆర్ డి ఎ భూముల్లో అక్రమంగా సాగు చేస్తున్న పంటలను అధికారులు దున్నివేశారు. సుమారు 40 ఎకరాలలో పంటలు సాగుచేస్తు న్నారని అధికారులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన భూముల్లో పంటల సాగు చేపట్టవద్దని సి ఆర్ డి ఎ అధికారులు ఇటీవల రాజధాని గ్రామాల్లో మైక్ ప్రచారం నిర్వహించారు. అక్రమంగా పంటల చేసే వారిని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ శాఖమూరులో కొంతమంది మినుము, కంది తదితర పంటలు సాగు చేస్తుండడంతో అధికారులు మంగళవారం పంటల తొలగింపు చర్యలు చేపట్టారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రోక్లైనర్ తో పంటలను తొలగించారు.

# కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులపై ఆశ

- రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపై శాఖల కసరత్తు



అమరావతి, ప్రజాభూమి

కేంద్రం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో ప్రతిపాదనలకు సింబంధించి ఇప్పటికే నివేదికలు అందచేశారు. కేంద్రం నుంచి వివిధ రంగాలకు రాబట్టాలనుకున్న మొత్తాలకు లెక్కలు వేసి పంపించారు. ఇక రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులకు సంబంధించి కసరత్తుచేస్తున్నారు. వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కోసం అన్ని శాఖలు కసరత్తు ముమ్మరం చేస్తున్నాయి. కీలక శాఖల నురచి ఇరదుకోసం భారీ ప్రతిపాదనలే సిద్ధమవుతున్నట్లు తెలుస్తోరది. అది ఎంతలా అరటే కేటాయిరపులకు వీలు కాని విధంగా ఈ ప్రతిపాదనలు ఉరటున్నట్లు సమాచారం. వాస్తవానికి కావాల్సిన మొత్తం కన్నా అధికంగా నిధులు కోరుతున్నట్లు తెలిసిరది. ప్రధానంగా కొన్ని పెద్ద శాఖలు సిద్ధం చేస్తున్న ప్రతిపాదనలైతే వేల కోట్లలో ఉరటున్నట్లు సమాచారం. ఫిబ్రవరి మూడో వారంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికోసం ఇప్పటికే అన్ని శాఖలకు ఆర్థికశాఖ నిర్దిష్ట మార్గదర్శకాల తో సర్క్యులర్ జారీ చేసిరది. ఏయే రంగాల్లో, ఎలారటి తరహాలో ప్రతిపాదనలు పంపిరచాలన్నది కూడా స్పష్టం చేసిరది. అనేక శాఖలు ఈ మార్గదర్శకాలను పట్టిరచుకోకుండానే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారర. ప్రధానంగా నీటిపారుదల, పంచాయితీరాజ్, పట్టణాభివృద్ధి, విద్య, వైద్యం వంటి శాఖలు తయారుచేస్తున్న ప్రతిపాదనలు పరిమితి దాటి ఉరటున్నట్లు తెలిసింది. అలాగే చిన్న చిన్న శాఖలు కూడా అవసరాలకు మిరచే ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోరది. గతేడాది వ్యయానికి అనుగుణంగానే కొత్త ప్రతిపాదనలు ఉరడాలన్నది ఆర్థికశాఖ మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొంది. కేటాయిరచిన నిధులు ఎరత, విడుదల చేసిన మొత్తం, అరదులో ఖర్చు చేసినది ఎరత అన్నది అధ్యయనం చేసిన తరువాతే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్దేశించింది.

# సిఎం మమత తొందరపాటు చర్య

- ఆర్జీకర్ మృతురాలి తండ్రి ఆరోపణలు



కోల్‌కతా, ప్రజాభూమి

ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. సర్కారు తీరును మృతురాలి తండ్రి తప్పుపట్టారు. ఈ వ్యవహారంలో సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు అవసరం లేదని అన్నారు 'రేపు మాకు తీర్పు కాపీ వస్తుంది. దానిని పరిశీలించిన తర్వాత ఏమి చేయాలో నిర్ణయించుకుంటాం. అప్పటివరకు సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు తీసుకోకూడదు. ఆమె ఎన్నో మాటలు చెప్పి.. సాక్ష్యాలను తారుమారు చేశారు. వాటిని తారుమారు చేసిన వారిలో పోలీస్ కమిషనర్, ఇతరుల ప్రమేయం ఉంది. ఇవన్నీ మమత చూడలేదా..?' అని సూటిగా ప్రశ్నించారు. సీబీఐ సరైన సాక్ష్యాధారాలు సమర్పించలేక పోవడం వల్లే..స్థానిక కోర్టులో జీవిత ఖైదు పడినట్లు భావిస్తున్నామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు కారణమైన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌కు న్యాయస్థానం సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మరణించే వరకూ జైలు జీవితం గడపాలని పేర్కొనింది. దోషికి రూ.50 వేల జరిమానా కూడా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది. గత ఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్.జి.కర్ ప్రభుత్వ ఆసుపత్రి-వైద్య కళాశాల సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసులో శనివారం న్యాయస్థానం పౌర వాలంటీర్ సంజయ్‌ను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. సోమవారం అతనికి శిక్ష ఖరారు చేసింది. ఈ తీర్పుపైనే బెంగాల్ ప్రభుత్వం కలకత్తా హైకోర్టుకు వెళ్లింది.

# లోకేశ్ వ్యవహారంపై నోరు మెదపవద్దు

- పార్టీ శ్రేజులకు జనసేన హుకూం

అమరావతి, ప్రజాభూమి

ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని పలువురు తెదేపా నేతలు కోరుతున్న నేపథ్యంలో ఈ అంశం రాజకీయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని రోజులుగా తెదేపా, జనసేన నేతలు ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తున్నారు. ఈక్రమంలో జనసేన పార్టీ అధిష్ఠానం మంగళవారం స్పందించింది. ఇకపై ఈ వ్యవహారంలో పార్టీకి చెందిన నేతలెవరూ బాహాటంగా స్పందించవద్దని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొద్దని జనసేన కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇదే అంశంపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం కూడా సోమవారం ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. లోకేశ్ డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఎవరూ మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని పేర్కొంది.

# మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా ఢిల్లీ ఎన్నికలు

- ఆప్ ప్రజాదరణకు గండికొట్టేలా బిజెపి యత్నాలు
- సిఎం అభ్యర్థిని ప్రకటించడంలో పార్టీల వైఫల్యం

న్యూఢిల్లీ, ప్రజాభూమి



ఏ రాజకీయ పార్టీ కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రజల ముందు ఉంచలేని పరిస్థితుల్లో ఢిల్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికార పార్టీకి ఎదురులేని నాయకుడైనప్పటికీ చట్టపరమైన చిక్కుల కారణంగా వారు ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చెప్పలేకపోతున్నారు. బిజెపి, కాంగ్రెస్ రెండింటికీ దేశ రాజధానిలో తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడానికి ప్రజాదరణ పొందిన లేదా బలమైన నాయకుడే లేరు. స్థానిక నాయకత్వం లేకపోవడంతో, వారు ఓటర్లను ఆకర్షించడానికి బయటి నుండి 'దిగుమతి చేసుకున్న' నాయకులు లేదా తమ హైకమాండ్‌లపై ఆధారపడుతున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి చాలా ముందుగానే తన అభ్యర్థులందరినీ ప్రకటించడం ద్వారా ఆప్ సౌకర్యవంతమైన స్థితిలో ఉండగా, అభ్యర్థుల ఎంపికలో బిజెపి, కాంగ్రెస్ చివరి వరకు తికమకపడుతున్నాయి. అంతర్గత కలహాలు, బలమైన అభ్యర్థులను గుర్తించడంలో అనిశ్చితి వారి ఎంపికలను కష్టతరం చేశాయి. మొదట్లో, బిజెపి మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని సిఎం అభ్యర్థి కాబోతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల బలమైన వ్యూహాత్మక నిర్వహణతో హర్యానా, మహారాష్ట్రలలో గొప్ప ప్రయోజనం పొందిన తర్వాత, బిజెపి ఇప్పుడు సొంతంగా సిఎం అభ్యర్థులను ప్రకటించే సాహసం చేయలేకపోతోంది.మాజీ ఐపిఎస్ అధికారిణి కిరణ్ బేడిని తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడం ద్వారా బిజెపి గతంలో ఒకసారి తప్పటడుగు వేసింది. ఓటర్లను లేదా బిజెపి కేడర్‌ను కూడా ఆమె ఉత్సాహపరచడంలో విఫలమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆమె పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఎన్నికల తర్వాత, ఆమె ప్రజాజీవితంలో ఎక్కడా కనిపించలేదు. అరవింద్ కేజ్రీవాల్ అధికార ఆప్‌కి కిరీటం లేని నాయకుడు కావడంతో సాధారణంగా అందరూ ఆ పార్టీ ముఖ్యమంత్రిగా భావిస్తున్నప్పటికీ ఆయన చట్టపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన అధికారిక ఫైళ్లపై సంతకం చేయలేరు లేదా సిఎం కార్యాలయంలోకి ప్రవేశింపలేరు.దానితో ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆప్ చెప్పలేకపోతున్నది. దానితో బిజెపి మార్గంలో ఆప్ కేజ్రీవాల్, సిఎం ఆతిశీ అనే డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ప్రస్తావిస్తున్నారు. కేజ్రీవాల్ ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రజలను 'ద్వేషిస్తున్నాడని' ఆరోపించడంపై దృష్టి సారించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ నుండి తీసుకువచ్చిన నమోదిత ఓటర్లలో అకస్మాత్తుగా, వివరించలేని పెరుగుదల ఉందని ఆప్ అభ్యంతరాన్ని వ్యక్తం చేయడాన్ని వారు ఈ విధంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు చేశారు. ఏదో ఒక దుష్ప్రచారంతో ఆప్‌ను ఆత్మరక్షణలో పడవేసి ప్రయత్నం కాకుండా నేరుగా ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా బిజెపి ప్రచారం చేయలేకపోతున్నారు. చివరకు ప్రధాన మంత్రి సైతం వ్యక్తిగత విమర్శలతో కేజ్రీవాల్ ప్రభావం ప్రజలపై తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.

# శాసనసభల గౌరవం పెంచేలా చూడాలి

- అవసరమైతే ప్రవర్తనా నియమావళి నిర్దేశించాలి
- లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా పిలుపు



పాట్నా, ప్రజాభూమి

శాసనసభల గౌరవం పరిరక్షణ నిమిత్తం రాజకీయ పార్టీలు తమ శాసనకర్తలకు ఒక ప్రవర్తన నియమావళిని నిర్దేశించాలని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా పిలుపు ఇచ్చారు. పాట్నాలో 85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌లో మంగళవారం ఓమ్ బిర్లా ప్రసంగిస్తూ, రెండు రోజుల సంప్రదింపుల అనంతరం చర్చకు ప్రధాన కేంద్రంగా శాసనసభలను చేయాలని సభాపతులు తీర్మానించారని తెలియజేశారు. 'శాసనసభల గౌరవం పరిరక్షణలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి. రాజకీయ పార్టీలు తమ శాసనకర్తల కోసం ప్రవర్తన నియమావళిని రూపొందించినపప్పుడే ఇది సాధ్యం అవుతుంది' అని బిర్లా స్పష్టం చేశారు. పలు శాసనసభలలో పదే పదే అంతరాయాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ వినియోగం ద్వారా శాసనసభల పని తీరులో మరింత సామర్థ్యాన్ని తీసుకురావలని కూడా సభాపతులు తీర్మానించినట్లు లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. 1947 నుంచి ఇప్పటి వరకు జరిగిన పార్లమెంటరీ చర్చలను రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్‌లో గుర్తించిన 22 భాషల్లో పార్లమెంట్ త్వరలో అందుబాటులోకి తీసుకురాగలదని బిర్లా ప్రకటించారు. శాసనసభలు కూడా 1947 నుంచి జరిగిన చర్చలను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో లభ్యమయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఇందు కోసం పార్లమెంటరీ సెక్రటేరియల్ నుంచి సాంకేతిక సహాయం అందజేయగలమని ఆయన హామీ ఇచ్చారు. అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌క బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా. బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ శాసన మండలి చైర్మన్ అవధేశ్ నారాయణ్ సింగ్ ప్రభృతులు హాజరయ్యారు.



# తలసేమియా వ్యాధిపై అవగాహన

- విజయవాడలో 15న 'యుఫోరియా మ్యూజికల్ నైట్'
- ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి



అమరావతి, ప్రజాభూమి

తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'యుఫోరియా మ్యూజికల్ నైట్' నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15న కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కూడా ఆహ్వానిస్తామని నారా భువనేశ్వరి తెలిపారు.'ఎన్టీఆర్ కష్టపడి పైకి వచ్చారు. రాజకీయ రంగంలో ఏమీ ఆశించకుండా ప్రజల కోసం ముందుకు నడిచారు. పేదల కోసం ఎన్నో పథకాలు తెచ్చారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, ఆడపిల్లలకు ఆస్తిలో సమానహక్కు వంటివి ఆయన తెచ్చినవే. ప్రజా నాయకుడు చంద్రబాబు.. ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించారు. ఏ ప్రభుత్వ సహాయం తీసుకోకుండా ముందుకు సాగుతున్నాం. ఫైలిన్, హుద్ హుద్, కేరళలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంతో మందికి సాయమందించాం.తలసేమియా బారిన పడిన వారికి సహాయం చేసేందుకు బ్లడ్ బ్యాంక్ నిర్వహిస్తున్నాం. కొందరికి రక్తదానం అంటే భయం, మరి కొందరికి ఇష్టం ఉండదు. బ్లడ్ డొనేషన్ సమాజానికి ఎంతో మంచి చేస్తుంది. ప్రతి రక్తపు చుక్క ప్రజల ప్రాణాలను కాపాడుతుంది. మేము అడిగిన వెంటనే మ్యూజికల్ నైట్ నిర్వహించేందుకు తమన్ అంగీకరించారు. కుటుంబ సమేతంగా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నా. బుక్ మై షోలో టికెట్స్ అందుబాటులో ఉన్నాయి. మీరు కొన్న టికెట్స్ డబ్బుని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం' అని భువనేశ్వరి తెలిపారు.

# ఒక రోజు ముందే ఇంగ్లండ్ తుది జట్టు ప్రకటన!

ఇంగ్లండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ మరోసారి తన మార్క్ చూపెట్టాడు. భారత పర్యటనలోనే పరిమిత ఓవర్ల కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్.. ఒక రోజు ముందే తుది జట్టును ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. సాధారణంగా టాస్ పడే వరకు తుది జట్లను ప్రకటించరు. పిచ్ కండిషన్స్.. టాస్ ఫలితాన్ని బట్టి చివరి నిమిషంలో కూడా తుది జట్టును మారుస్తుంటారు. కానీ దూకుడుకు మారు పేరైన బ్రెండన్ మెక్ కల్లమ్ ఒక రోజు ముందే ఇంగ్లండ్ తుది జట్టు ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ల కోసం ఇంగ్లండ్.. భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా బుధవారం తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ బరిలోకి దిగే ఇంగ్లండ్ తుది జట్టును ఒక రోజు ముందే ప్రకటించారు. జోస్ బట్లర్ సారథ్యంలో ఇంగ్లండ్ బరిలోకి దిగనుంది. ఫాస్ట్ బౌలర్ గస్ అట్కిన్సన్ ఏడాది తర్వాత టీ20 మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. అతను చివరగా 2023 డిసెంబర్‌లో వెస్టిండీస్‌తో టీ20 మ్యాచ్ ఆడాడు. ఆదిల్ రషీద్‌ను స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా జట్టులోకి తీసుకున్నారు. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌ను ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల వైస్ కెప్టెన్‌గా నియమించారు. జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్, గస్ అట్కిన్సన్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

ఆదిల్ రషీద్‌తో పాటు లియామ్ లివింగ్ స్టోన్ స్పిన్ బౌలింగ్ చేయనున్నాడు. ఒక రోజే ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించడంపై నెటిజన్లు బ్రెండన్ మెక్ కల్లమ్‌ను కొనియాడుతున్నారు.'ఏం గుండెరా అది'అని కామెంట్ చేస్తున్నారు. 2022లో ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన బ్రెండన్ మెక్‌కల్లమ్.. బజ్ బాల్‌తో టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చాడు. ఇంగ్లండ్‌కు సానుకూల ఫలితాలు రాకున్నా.. ఈ తరహా అప్రోచ్‌తో టెస్ట్ క్రికెట్‌కు క్రేజ్ పెరిగింది. గతేడాదే అతని కాంట్రాక్ట్ ముగిసింది. అయితే ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు. అతని కాంట్రాక్ట్‌ను 2027 వరకు పొడిగించింది. అంతేకాకుండా వైట్‌బాల్ ఫార్మాట్ కోచింగ్ బాధ్యతలను కట్టబెట్టింది. దాంతో మెక్‌కల్లమ్ ఇంగ్లండ్‌కు పూర్తి స్థాయి కోచ్‌గా మారాడు. గతేడాది సెప్టెంబర్‌లోనే నియామకమైనా.. భారత పర్యటనతోనే పరిమిత ఓవర్ల కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు.

**భారత్‌తో తొలి టీ20కి ఇంగ్లండ్ తుది జట్టు:**

బెన్ డకెట్, ఫిల్ సాల్ట్(వికెట్ కీపర్), జోస్ బట్లర్(కెప్టెన్), హ్యారీ బ్రూక్, లియామ్ లివింగ్ స్టోన్, జాకబ్ బెథెల్, జేమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.




# ముందు మ్యాచ్ లపై ఫోకస్ పెట్టు

## సంజూ శాంసన్‌కు సూర్య కుమార్ సూచన




ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో మరోసారి సంజూ శాంసన్ గురించి తీవ్ర చర్చ సాగుతోన్న సంగతి తెలిసిందే. అందుకు కారణం అతడిని ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయకపోవడమే. అయితే సంజూ మాత్రం ఈ విషయం గురించి ఆలోచిస్తున్నాడో లేదో తెలీదు కానీ.. ప్రస్తుత సమయాన్ని ఎంచక్కా హ్యాపీగా గడుపుతున్నాడు. ఈ క్రమంలోనే సంజూ శాంసన్ ఓ సూపర్ హిట్ బాలీవుడ్ సాంగ్ ను కూడా పాడి ఫ్యాన్స్ తో పాటు తన తోటి క్రికెటర్లను అలరించాడు. తాను పాడిన పాటను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అభిషేక్ నాయర్ తో కలిసి 'జీతా వోహి సికందర్' సాంగ్ ను పాడి దానికి ఫీడ్ బ్యాక్ ఇవ్వండి అంటూ కోరాడు. "సాధ్యం కానిది అంటూ ఏమీ లేదు. నేను పాట పాడు. నేను ముంబయికి వచ్చేయనా?(బాలీవుడ్)" అంటూ క్యాప్షన్ రాసు కొచ్చాడు. అయితే దీనికి సూర్య కుమార్ యాదవ్ ఫన్నీ రిప్లై ఇచ్చాడు. "న్వువ్వు ముంబయి వస్తావు. కానీ అంతకన్నా ముందు చెన్నై, రాజ్ కోట్ , పుణెకు వచ్చాకే రావాలి."

అని బదులిచ్చాడు. కాగా, జనవరి 22 నుంచి టీమిండియా.. ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్ ఆడ నుంది. ఈ సిరీస్ కు సంజూ శాంసన్ వికెట్ కీపర్ గా ఎంపి కయ్యాడు. తొలి మ్యాచ్ కోల్ కతా వేదికగా జరగనుంది. ఆ తర్వాత చెన్నై, రాజ్‌కోట్, పుణె వేదికగా మిగ తా మ్యాచ్‌లు నిర్వహించ నున్నారు. ఈ మ్యాచ్ వేదికలను ఉద్దేశించే సూర్య కుమార్ యాదవ్ రిప్లై ఇచ్చా డు. ముందు మ్యాచ్ లపై ఫోకస్ పెట్టు అన్నట్టుగా సూచించాడు. ఇక పోతే ఇప్పటికే తొలి మ్యాచ్ కోసం టీమిండి యాకోల్ కతాకు చేరు కుంది. ప్రాక్టీస్ సెషన్ కూడా ప్రారం భించింది. అక్కడే తన జట్టు సభ్యులతో ఉన్న సంజూ శాంసన్ పాటను పాడాడు.

# 13 ఏళ్ల తర్వాత దేశవాళి టోర్నీల్లోకి కోహ్లీ




టీమ్‌ఇండియా రన్నింగ్ మెషిన్ విరాట్ కోహ్లీ 13 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీలో బరిలో దిగనున్నాడు. గతకొంతకాలంగా ఫామ్? లేమితో సతమతమవుతున్న ఈ స్టార్ క్రికెటర్?, తన పెర్ఫామెన్స్?ను మెరుగుపరుచుకునేందుకు సిద్ధమయ్యాడు. 2012లో చివరగా రంజీ మ్యాచ్ ఆడాడు. మళ్లీ ఇన్నేళ్లకు ఇప్పుడు ఈ ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీలో ఆడనున్నాడు. ఇక జనవరి 30 నుంచి రైల్వేస్‌తో జరగనున్న చివరి లీగ్ మ్యాచ్‌లో దిల్లీ తరఫున బరిలోకి దిగనున్నాడు. అంతకుముందు జనవరి 23 నుంచి దిల్లీ, సౌరాష్ట్ర మ్యాచ్ మొదలవనుంది. అయితే మెడనొప్పి కారణంగా విరాట్ ఈ మ్యాచ్ ఆడట్లేదు. కానీ రైల్వేస్‌తో మ్యాచ్‌కు మాత్రం అందుబాటులో ఉంటానంటూ దిల్లీ క్రికెట్ అసోసియేషన్‌కు సమాచారం అందించాడు. దిల్లీ టీమ్ హెడ్ కోచ్ శరణ్‌దీప్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. మరోవైపు అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని టైమ్?లో అందుబాటులో ఉంటే ప్లేయర్లు తప్పకుండా దేశవాళీ లీగ్‌ల్లో ఆడాలని ఇటీవల బీసీసీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో స్టార్ క్రికెటర్లకు మినహాయింపులు ఉండవని పేర్కొంది. దీంతో రోహిత్ శర్మతో పాటు రవీంద్ర జడేజా, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ లాంటి ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో ఆడనున్నారు. గతేడాది 10 టెస్టుల్లో విరాట్ కోహ్లీ 24.52 సగటుతో కేవలం 417 పరుగులు మాత్రమే చేశాడు. అందులో ఒక శతకం, ఒక హాఫ్ సెంచరీ ఉంది. ఓవరాల్‌గా అన్ని ఫార్మాట్లలో కలిపి గతేడాది 32 ఇన్నింగ్స్ ల్లో 21.83 సగటుతో కేవలం 655 పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. మరోవైపు, పేలవ ఫామ్?తో ఇబ్బందిపడుతున్న కోహ్లీకి భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ మద్దతుగా నిలిచాడు. కోహ్లీ మంచి ఫిట్?నెస్?తో ఉన్నాడని, అతడు మరికొన్నేళ్లు క్రికెట్ ఆడొచ్చని అభిప్రాయపడ్డాడు. "నేను ఇప్పటికీ కోహ్లీకి మద్దతు ఇస్తున్నాను. 36 ఏళ్ల వయసులో కూడా అతను ఎప్పటిలాగే ఫిట్?గా ఉన్నాడు. అతని ఫిట్‌నెస్ స్థాయిలు అద్భుతంగా ఉన్నాయి." అని బంగర్ అన్నాడు.

కౌలాలంపూర్ అండర్-19 టీ-20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో మలేషియాపై విజయం సాధించింది.బౌలింగ్‌లో వైష్ణవి శర్మ కేవలం 5 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టి విధ్వంసం సృష్టించింది.అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ తరఫున హ్యాట్రిక్ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా వైష్ణవి రికార్డు సృష్టించింది. వైష్ణవి బౌలింగ్‌కు మలేషియా బ్యాట్స్‌మెన్ సులువుగా ఔట్ కావడంతో జట్టు మొత్తం 31 పరుగులకే కుప్పకూలింది. 32 పరుగుల లక్ష్యాన్ని కేవలం 17 బంతుల్లో వికెట్ నష్టపోకుండా టీమిండియా ఛేదించింది.17 బంతుల్లోనే లక్ష్యాన్ని చేధించారువైష్ణవి శర్మ ధాటికి టీమిండియా 31 పరుగులకే మలేషియాను ఆలౌట్ చేసింది. అనంతరం 32 పరుగుల లక్ష్యాన్ని ఓపెనింగ్ జోడీ గొంగడి త్రిష, జి కమలిని 17 బంతుల్లోనే ఛేదించారు. త్రిష మరింత దూకుడును ప్రదర్శించింది. కేవలం 12 బంతుల్లో 27 పరుగులతో వేగంగా ఇన్నింగ్స్ ఆడింది. ఈ ఇన్నింగ్స్‌లో త్రిష 5 ఫోర్లు కొట్టింది. కాగా కమలిని 4 పరుగులు చేసి మరో ఎండ్‌లో నాటౌట్‌గా నిలిచి జట్టుకు విజయాన్ని అందించి వెనుదిరిగింది. టీ-20 క్రికెట్‌లో భారత జట్టు చేసిన రెండో ఫాస్టెస్ట్ ఛేజింగ్ ఇది. టీమిండియా వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయాన్ని చవిచూసింది. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై భారత జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది..19 ఏళ్ల స్పిన్ బౌలర్ వైష్ణవి శర్మ నాలుగు ఓవర్ల స్పెల్‌లో కేవలం 5 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసి విధ్వంసం సృష్టించింది. మలేషియా బ్యాట్స్‌మెన్‌లు వైష్ణవి ముందు పూర్తిగా నిస్సహాయంగా కనిపించారు. వైష్ణవి బౌలింగ్‌లో ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు చేరుకోవడం ప్రారంభించారు. వైష్ణవి తన స్పెల్ చివరి ఓవర్లో వరుసగా మూడు బంతుల్లో 3 వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ పూర్తి చేసింది. అండర్-19 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ సాధించిన తొలి భారతీయ మహిళా క్రికెటర్‌గా వైష్ణవి రికార్డు సృష్టించింది.టోర్నీలో తొలి మ్యాచ్ ఆడుతున్న వైష్ణవి అద్భుతమైన బౌలింగ్ కారణంగా భారత జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారీ విజయాన్ని చవిచూసింది.



# వైష్ణవి హ్యాట్రిక్ 17 బంతులలోనే మలేషియా ఖేల్ ఖతం




ఇంగ్లాండ్ తోతొలి టీ20 మ్యాచ్ కు ముందు టీమిండియా యంగ్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఓ భారీ రికార్డు ఊరిస్తోంది. అతడు టీ20ల్లో భారీ రికార్డుకు అతి చేరువలోకి వచ్చాడు. అంతర్జాతీయ టీ20ల్లో మరో రెండు వికెట్లు తీస్తే.. ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా నిలుస్తాడు. ఇంగ్లాండ్‌తో జనవరి 22 నుంచి ప్రారంభం కానున్న ఐదు టీ20 మ్యాచుల సిరీస్‌లో అర్ష్‌దీప్ ఈ రికార్డును చేరుకోవడం ఖాయం. కాగా, ఇంగ్లాండ్‌తో టీ20, వన్డే సిరీస్‌కు సెలెక్ట్ అయిన అర్ష్‌దీప్.. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ స్క్వాడ్ లోనూ స్థానం సంపాదించుకున్నాడు. టీ20ల్లో అర్ష్‌దీప్ సింగ్‌కు మంచి రికార్డే ఉంది. గత ఏడాది జరిగిన టీ20 వరల్డ్ కప్ ను టీమిండియా గెలుచుకోవడంలో అర్ష్‌దీప్ కీలకంగా వ్యవహరించాడు. 8 మ్యాచుల్లో 17 వికెట్లు తీశాడు. అయితే ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 ల్లో అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ అగ్రస్థానంలో ఉన్నాడు. 80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లతో టాప్ లో ఉన్నాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ సింగ్ 60 మ్యాచుల్లో 95 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.కాబట్టి ఇప్పుడు ఇంగ్లాండ్‌తో జరగబోయే సిరీస్‌లో అర్షదీప్ సింగ్ ఐదు వికెట్లు తీయగలిగితే.. టీ20ల్లో 100 వికెట్లు ఖాతాలో వేసుకున్న తొలి భారత బౌలర్‌గానూ రికార్డు సృష్టిస్తాడు.

# అర్ష్‌దీప్ సింగ్‌ను ఊరిస్తోన్న భారీ రికార్డు

# షమి ఫిట్‌గా ఉన్నందుకు ఆనందంగా ఉంది

## భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ



చాలాకాలం తర్వాత టీమిండియా సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహమ్మద్ షమీ మళ్లీ భారత జెర్సీలో కనిపించబోతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ అనంతరం గాయంతో జట్టుకు దూరంగా ఉన్న షమి, ఇప్పుడు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట పునరాగమనం చేయడానికి సిద్ధమయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరుగనున్న టీ20 సిరీస్, వన్డే సిరీస్‌తో పాటు తర్వాత జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం కూడా అతడు ఎంపికయ్యాడు. షమి రీ ఎంట్రీపై భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ సంతోషాన్ని వ్యక్తం చేశాడు. షమి జట్టులో చేరడంతో టీమ్‌ఇండియా బలం మరింత పెరిగిందని ఆయన చెప్పారు. షమి ఫిట్‌గా ఉన్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. అతను జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత భారతదేశంలో బౌలర్ అని నేను భావిస్తున్నాను. షమి కొంత భయాందోళనతో ఉండవచ్చు, ఎందుకంటే మోకాలి గాయం తర్వాత చాలా కాలం క్రికెట్ ఆడడం. కానీ దేశవాళీ క్రికెట్లో బెంగాల్ తరఫున ఆడడం అతడికి ఎంతో అనుకూలంగా ఉంటుందని నేను నమ్ముతాను. ఈ అనుభవం రాబోయే మ్యాచ్‌ల్లో అతడికి ఎంతో ఉపయోగపడుతుంది. షమి జట్టులోకి రావడం, బుమ్రాపై భారం తగ్గించడంతో టీమ్‌ఇండియా ప్రదర్శన మెరుగుపడుతుంది. బుమ్రా ఒక ఎండ్ నుంచి, షమి మరో ఎండ్ నుంచి బౌలింగ్ చేయడం విశేషంగా ఉంటుంది. ఈ ద్వయం టెస్టు క్రికెట్లో కూడా సక్సెస్ అయ్యింది" అని గంగూలీ పేర్కొన్నాడు. ఇటీవల ముగిసిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో జస్‌ప్రీత్ బుమ్రా పేస్ బౌలింగ్‌లో పెద్ద భారం మోశాడు.అతను ఎక్కువ పని భారం ఉన్న కారణంగా గాయపడ్డాడు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి ఆందోళన ఉండగా, షమి తిరిగి జట్టులో చేరడం టీమ్‌ఇండియాకు ఎంతో ఊరట కలిగించిందని చెప్పవచ్చు. ఈవేళ ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో బుమ్రా కూడా ఉన్నాడు, అతడు ఫిట్‌గా ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో ఆడనున్నాడు.బుమ్రా, షమి ద్వయం కలిసి రాణించి, భారత్‌ను ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిపేందుకు అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# చరణ్-జాన్వీ సీన్‌లోకి వచ్చేదెప్పుడంటే?



ఇటీవలే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫలితం రామ్ చరణ్‌ని తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. హిట్ తో సంచలనం అవుతుంద నుకుంటే? రివర్స్ లో ఫ్లాప్ తో పెను సంచలనమైంది. ఈ విషయం చరణ్ ని కాస్త డిస్టబెన్స్ కి గురి చేసింది. ఇప్పుడిప్పుడే ఆ జ్ఞాపకాల నుంచి బయటకు వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆర్సీ 16ని పట్టాలెక్కించాలని చూస్తున్నాడు. ఇప్పటికే ఈసినిమా షూటింగ్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. తొలి షెడ్యూల్ కూడా పూర్తయింది. రామ్ చరణ్, జాన్వీ కపూర్ సహా ప్రధాన పాత్ర దారులపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. గేమ్ ఛేంజర్ రిలీజ్ నేపథ్యంలో చరణ్ ఆ సినిమా షూట్ నుంచి రిలీవ్ అయ్యాడు. అప్పటి నుంచి మళ్లీ ఆర్సీ 16 షూట్ కి వె ళ్లలేదు. ఈ నేపథ్యంలో కొత్త షెడ్యూల్ జనవరి 27 నుంచి మొదలు పెట్టడానికి దర్శకుడు బుచ్చిబాబు రెడీ అవుతున్నారు. హైదరాబాద్ లో ని భూత్ బంగ్లాలో ఈ షెడ్యూల్ ప్రారంభమవుతుంది. త్వరలోనే ఈ షెడ్యూల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇందులో రామ్ చరణ్ తో పాటు జాన్వీ కూడా జాయిన్ అవుతుంది. ఇద్దరిపై కొన్ని కీ సీన్స్ తెరకెక్కించనున్నారుట. అక్కడ కేవలం వారం రోజులు మాత్రమే షూటింగ్ ఉంటుందిట. అటుపై షూట్ రామోజీ ఫిలిం సిటీకి షిఫ్ట్ అవుతుందని సమాచారం. ఇక్కడ షూట్ లో మాత్రం కీలక పాత్ర ధారులంతా యాడ్ అవుతారని సన్నిహిత వర్గాల సమాచారం. అయితే ఈ సినిమా రామ్ చరణ్, జాన్వీ కపూర్ చాలా ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాతో చరణ్ ఎలాగైన హిట్‌అందుకోవాలి. అలాగే జాన్వీ కి కూడా కీలకమే. జాన్వీ డెబ్యూ దేవర డివైడ్ టాక్ తో నడించింది. జాన్వీ పాత్ర పరంగా తీవ్ర విమర్శలు కూడా ఎదుర్కొంది. నటిగా ప్రేక్షకుల్ని అలరించలేదనే విమర్శ వ్యక్తమైంది. ప్లాస్టిక్ ఎక్స్ ప్రెషన్స్ తప్ప సహజ నటన ఎక్కడా కనిపించలేదని ట్రోలింగ్ ఫేస్ చేసింది. ఈ నేపథ్యంలో ఆర్సీ 16తో ఆ విమర్శల్ని ఎలాగైనా బధులివ్వాలని చూస్తోంది.

### ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయానికి వచ్చిన

# సినీహీరో నాగచైతన్య



టాలీవుడ్ యాక్టర్ నాగచైతన్య ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో సందడి చేశాడు. తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవడానికి ఆర్టీవో కార్యాలయానికి వచ్చాడు. నాగచైతన్య రెన్యూవల్ కోసం ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేశ్‌ను కలిశాడు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులు నాగచైతన్యను డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు తెలుసుకుని రెన్యూవల్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైతూను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆర్టీవో కార్యాలయానికి తరలివచ్చారు. నాగచైతన్య ప్రస్తుతం తండేల్ సినిమాలో నటిస్తున్నాడు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీకి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ షురూ చేసేందుకు రెడీ అవుతున్నారు.

## బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం : దిల్‌రాజ్ భార్య



ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసాలు, ఆఫీసుల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసిందే. హైదరాబాద్‌లోని 8 చోట్ల ఏకకాలంలో 55 బృందాలు దాడులు చేపట్టాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దిల్ రాజు భార్య తేజస్వినిని అధికారులు బ్యాంక్‌కు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తేజస్విని మీడియాతో మాట్లాడుతూ.. ఇవాళ ఉదయం నుంచి ఐటీ సోదాలు జరుగుతున్నా యన్నారు. బ్యాంకు వివరాలు కావాలని అధికారులు అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించామని చెప్పారు. దిల్ రాజు నివాసాలతోపాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి ఇండ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. దిల్ రాజు వ్యాపార భాగస్వాముల నివాసాలతోపాటు పుష్ప 2 సినిమా నిర్మాత నవీన్ ఎర్నేని, మైత్రి మూవీస్ కార్యాలయాల్లో కూడా ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి



# యానిమల్ బ్యూటీ క్లోజప్ అందాలు

త్రిప్తి డిమ్రీ సినిమా ఇండస్ట్రీలో నటిగా అడుగు పెట్టి చాలా కాలం అయినా దక్కని గుర్తింపు 'యానిమల్' సినిమాతో దక్కింది. ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్‌గా పేరు దక్కించుకుంది. యానిమల్ సినిమాలో రణబీర్ కపూర్‌తో చేసిన సన్నివేశాల కారణంగా త్రిప్తి డిమ్రీకి ఒక్కసారిగా గుర్తింపు లభించింది. యానిమల్‌లో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న కంటే ఎక్కువగా త్రిప్తి గురించి మీడియాలో చర్చ జరిగింది. ప్రేక్షకులు సైతం త్రిప్తి గురించి మాట్లాడుకున్నారు. అందుకే యానిమల్ విడుదల అయిన వెంటనే బాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ నాలుగు ఐదు సినిమాల్లో నటించే అవకాశాలు దక్కిన విషయం తెల్సిందే. ఇప్పటికే బాలీవుడ్‌లో త్రిప్తి నటించిన సినిమాలు బ్యాక్ టుబ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. యానిమల్ ఇచ్చిన క్రేజ్‌తో గత ఏడాది మూడు సినిమాలతో త్రిప్తి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు రెండు మూడు సినిమాలు చేస్తోంది. అవి మాత్రమే కాకుండా మరికొన్ని సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తంగా త్రిప్తి జోరు మామూలుగా లేదు. ఓ రేంజ్‌లో ఈ అమ్మడు సినిమాలతో దూసుకు పోతుంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం, అంతే కాకుండా నటనతో మెప్పించేంత ప్రతిభ ఈ అమ్మడికి ఉంది. అందుకే బిజీ బిజీగా సినిమాలు చేస్తుంది. సినిమాలతో వచ్చిన క్రేజ్ కారణంగా సోషల్ మీడియా లో ఈ అమ్మడి ఫాలోయింగ్ విపరీతంగా పెరిగింది. సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్ కోసం ముద్దుగుమ్మ త్రిప్తి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఎక్కువ ఎబ్బెట్టుగా లేకుండా చాలా అందంగా కనిపించే విధంగా త్రిప్తి ఫోటోలకు ఫోజ్‌లు ఇస్తుందని అంటారు. బాలీవుడ్‌లో చాలా మంది హీరోయిన్స్‌తో పోల్చితే త్రిప్తి చాలా అందంగా ఉంటుందని, నటనతోనూ వారికంటే బెటర్‌గా మెప్పిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా క్లీవేజ్ షో చేస్తూ క్లోజప్‌లో నడుము అందాన్ని చూపించిన ఈ అమ్మడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతు న్నాయి. ఆకట్టుకునే విధంగా ఉన్న ఈ ఫోటోలు త్రిప్తి డిమ్రీ గురించి సోషల్ మీడియాలో మరింత ఎక్కువగా చర్చ జరిగేలా చేస్తుంది. ఇంత అందం ఉండి ఇన్నాళ్లు కనిపించ కుండా ఎలా ఉందంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. యానిమల్ సినిమా లో ఈమెని దర్శకుడు చూపించింది కొంచెమే అని, సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఫోటోలను చూస్తూ ఉంటే మరింత అందంగా ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తా నికి యానిమల్ తో బ్రేక్ దక్కించుకున్న ఈ అమ్మడు తెలుగు సినిమాల్లో ఎప్పుడు నటిస్తుందో చూడాలి.

# ఏసుబాయిగా రష్మిక



పుష్ప ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్నా. గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇందులో రష్మిక ఛత్రపతి శివాజి సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ రేపు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. కథానుగుణంగా సినిమా పూర్తిగా మరాఠి భాషలో సాగనుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో రష్మిక మరాఠి భాష నేర్చుకుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.

# విజయ్ సినిమా టీజర్ రెడీ



ఫ్యామిలీ స్టార్ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ కాంపౌండ్ నుంచి వరుస సినిమాలు రాబోతున్న విషయం తెలిసిందే. వీటిలో ఒకటి జెర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న వీడీ12. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను మే 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారని ఇప్పటికే వార్తలు రాగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా ప్రస్తుతం ఈ సినిమా టీజర్ ఎప్పుడనే వార్త బయటకు వచ్చింది. ఈ మూవీ టీజర్ రెడీ అయింది. ఫిబ్రవరి 7న టీజర్ విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నారు. టీజర్‌లో విడుదల తేదీ చెప్పబోతున్నారంటూ.. మే 30 డేట్‌ను మరోసారి గుర్తు చేసింది పీఆర్ టీం. ఇంకేంటి మరి త్వరలోనే వీడీ12 టీజర్ రాబోతుందన్నమాట. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. వీడీ 12లో విజయ్ దేవరకొండ తొలిసారి ఖాకీ డ్రెస్ వేసుకోబోతున్నాడు. ఇందులో విజయ్ దేవరకొండ పవర్ ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నాడని సమాచారం. విజయ్ దేవరకొండ ఈ ప్రాజెక్టుతోపాటు రాజావారు రాణిగారు ఫేం రవికిరణ్ కోలా దర్శకత్వంలో సినిమా కూడా చేస్తున్నాడు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ తెరకెక్కిస్తోంది.